
# నన్ను క్షమించు నాన్నా!



ఆంధ్రభూమి వీక్లీ.. 25 డిసెంబర్, 2003

"నాన్నా... రేపు ఎంసెట్ రిజల్ట్స్ అనౌన్స్ చేస్తారట!" సుప్రియ- తండ్రి సాయిరాంతో చెప్పింది.

"అవును... ఉదయం వార్తల్లో చెప్పారు!"

"మీకు టెన్షన్‌గా లేదా?"

"టెన్షన్‌గా లేదు... కుతూహలంగా ఉంది."

"భరత్ చాలా టెన్షన్‌గా ఉన్నాడు. ఉదయం నుంచీ నాతో, అమ్మతో మాట్లాడటం లేదు. పూజగదిలో అరగంట గడిపాడు."

"నాతో ఎటూ వాడు మాట్లాడటం లేదు. కాబట్టి మనందరికంటే ఆ భగవంతుడే అదృష్టవంతు డన్నమాట!" అన్నాడు సాయిరాం నవ్వుతూ. అతనికి నెలరోజుల క్రిందట జరిగిన సంఘటన గుర్తుకొచ్చింది...

• • •

**"భ**రత్! నాన్నగారు పిలుస్తున్నారు నిన్ను!" సుప్రియ చెప్పింది తమ్ముడితో.

"నేను చదువుకుంటున్నాను. ఎందుకో కాస్త కనుక్కో!"

"ఊరంతా తిరిగి రావడానికి ఓపికుందిగానీ, నాన్న పిలిస్తే వెళ్లడానికి మాత్రం నీకు ఓపిక లేదా? వెళ్లు... మళ్లీ నాన్నకు కోపం వస్తుంది."

"ఓపిక లేకకాదు. వెళ్తే క్లాసు పీకుతాడు. మళ్లీ నా మూడంతా పాడవుతుంది. ఈరోజంతా వేస్ట్ అవుతుంది."

ఇంతలో పిల్లల గదిలోకి వచ్చిన సాయిరాం వాళ్ళ మాటలు విన్నాడు. మనసులో ముల్లు గుచ్చుకున్నట్లుంటుంది- అతనికి కొడుకు అలా మాట్లాడినప్పుడల్లా.

"భరత్... నీతో కొద్దిగా మాట్లాడాలి!" అతని ఎదురుగా కూర్చుంటూ అన్నాడు.

"మాట్లాడండి..."

"ఈరోజు తారీఖెంతో తెలుసా?"

"ఇరవై అయిదు!"

"నీ ఎంసెట్ పరీక్ష ఎప్పుడు?"

"వచ్చేనెల పదిహేనో తారీఖు!"

"మరి, నువ్వు ఇంకా రాత్రి పదకొండుదాకా స్నేహితులతో తిరగడం సబబుగా ఉందా?"

"నేను ఆవిధంగా తిరిగింది నిన్న ఒక్కరోజే! రోజూ తిరుగుతున్నట్టు మాట్లాడతారేం నాన్నా?"

"ఒకరోజు తిరిగితే నేను పట్టించుకునేవాణ్ణి కాను. దాదాపు ఈ వారమంతా నువ్వు అలాగే తిరుగుతున్నావు."

"సరే... ఇక తిరగను. ఇంట్లోనే చదువుకుంటాను. ఇక నన్ను వదిలెయ్యండి!" రెండుచేతులూ జోడించి అన్నాడు భరత్.

అతని మాటలు, మొఖంలో విసుగు- సాయిరాం మనసును ఎంతో బాధించింది.

"ఏరా... తండ్రిగా పిల్లలకు మంచి చెప్పడం కూడా తప్పేనా? ఆ అధికారం కూడా నాకు లేదా?" కళ్ళనీళ్లతో అన్నాడు.

"ఉంది. కానీ, ఆ ఉపన్యాసాలు భరించే శక్తి నాకు లేదు."

అప్పుడే అక్కడికి వచ్చిన భరత్ తల్లి శిరీష- కొడుకు మాటలు విని కోపంతో... "భరత్! నువ్వు చదవకపోయినా ఫర్వాలేదు. ముందు పెద్దల్ని గౌరవించడం నేర్చుకో! తండ్రి అనికూడా చూడకుండా మాట్లాడుతున్నావు!" అంది.

"ఆయనకు నువ్వు కూడా తోడయ్యావా? ఇక నేను చదివినట్లే!" అంటూ లేచి చెప్పులు వేసుకుని బయటకు నడిచాడు.

చాలాసేపు భార్యాభర్తలిద్దరూ మౌనంగా కూర్చుండిపోయారు.

సుప్రియ జాలిగా తండ్రివైపు చూసింది.

"ఈమధ్య వీడి నోటికి అడ్డూ, అదుపూ లేకుండా పోతోంది. ప్రతిరోజూ గొడవలే! ఇంత చేస్తున్న మిమ్మల్ని- వాడు అవమానించడం నేను సహించలేకపోతున్నాను" అంటూ ఏడవసాగింది శిరీష.

"ఛ... ఏమిటిది... ఊరుకో! అయినా నేనుమాత్రం వాళ్ళకోసం ఏం చేస్తున్నాను? అందరు తండ్రుల్లా చదివిస్తున్నాను. అంతేగా? ఇలాంటి గొడవలు అన్ని ఇళ్ళల్లోనూ జరుగుతున్నవే! ఎక్కువగా ఆలోచించి ఆరోగ్యం పాడుచేసుకోకు. వాడు మారతాడు... ధైర్యంగా ఉండు!"

"మీరు వాడికి అంత చనువు ఇచ్చి ఉండకూడదు."

"నిజమే... తండ్రీకొడుకులు స్నేహితుల్లా కలిసి ఉండటం నాకిష్టం! అప్పుడే వాళ్ళు బాధలు, భయాలు మనతో పంచుకొంటారు. నేనూ నాకు తెలిసిన విషయాల్ని, విజ్ఞానాన్ని వాళ్ళకు పంచవచ్చనే ఉద్దేశ్యంతో బాగా చనువిచ్చాను. ఇకపై దూరంగానే ఉంటాను" అన్నాడు సాయిరాం.

అయితే ఆరోజు నుంచే తండ్రితో మాట్లాడటం మానేశాడు భరత్.

మరుసటిరోజు ఎంసెట్ ఫలితాలు విడుదల చేశారు.

భరత్‌కు ఇరవై వేలు దాటింది ర్యాంకు! ఇంటర్‌నెట్‌లో తన ర్యాంకు చూసుకొని దిగ్భ్రాంతి చెందాడు భరత్. గదిలోకెళ్లి తలుపేసుకొని పడుకొన్నాడు.

సాయిరాం కూడా ఆ ఫలితాలు తెలుసుకొని నిరుత్సాహపడ్డాడు. అయితే, వెంటనే తేరుకొని భార్యతో- "నువ్వెళ్లి వాణ్ణి ఓదార్చు. ఎంసెట్టే జీవితం కాదని చెప్పు!" అన్నాడు.

తల్లి ఓదార్చినా భరత్ బాధ తీరలేదు. సాయంత్రం నాలుగు గంటలకు సుప్రియ కాలేజీ నుంచి వచ్చింది.

"సారీ భరత్! ఉదయం నాన్నకు ఫోన్ చేస్తే నీ ర్యాంకు చెప్పారు. ఎక్కడ పొరబాటు జరిగి ఉంటుంది?" అంది తమ్ముడితో.

"అదే నాకూ అర్థంకావడం లేదు. నేను బాగా చదివాను... బాగా రాశాను కూడా!" అన్నాడు కళ్ళనీళ్లతో.

"భరత్... నువ్వేమీ అనుకోనంటే నేనో మాట చెప్పనా?"

చెప్పమన్నట్టు తలాడించాడు భరత్.

"నువ్వు ఫస్టియర్ వరకు చాలా వినయంతో ఉండేవాడివి. అమ్మానాన్నల్ని గౌరవించేవాడివి. సెకండియర్‌కు వచ్చాక నీకు అహంకారం పెరిగింది. ఫస్టియర్ పరీక్షల్లో నీకు తొంభైశాతం మార్కులు రావడంతో నీ అహంకారం మరింత పెరిగింది. అప్పట్నుంచీ అమ్మానాన్నల్ని ఎదిరించి మాట్లాడేవాడివి. ముఖ్యంగా నాన్నను ఎంతో అవమానించావు. నీ తప్పుల్ని తల్లిదండ్రులు కాబట్టి వాళ్ళు క్షమించి వదిలారు. కానీ, ఆ భగవంతుడు మాత్రం నిన్ను క్షమించలేదు. ఆ విషయం నీ ఎంసెట్ పరీక్షా ఫలితాలు ఋజువు చేశాయి."

"నేను అనవసరంగా ఆయనతో గొడవలు పడలేదు. నేను చదువుతున్నా చదవడం లేదంటే నాకు కోపమొచ్చి ఎదురుతిరిగేవాణ్ణి!"

"భరత్! ఆయన మనల్ని ఎప్పుడూ చదవమని పదిసార్లు చెప్పేవాడు కాదు. 'మనం చదువును నిర్లక్ష్యం చేస్తున్నాం' అని ఆయనకు అనిపించినప్పుడే మనల్ని హెచ్చరించేవాడు.

మనం ఎంత క్రమశిక్షణతో పెరిగినా, బాధ్యతలు తెలిసినా ఒక్కోసారి గాడి తప్పి ప్రవరిస్తుంటాం. అందుకే ఇంట్లో ఎవరో ఒకరంటే భయం ఉండాలి. అసలు చాలామంది తల్లిదండ్రులతో పోలిస్తే మన అమ్మానాన్నలు ఎంత ఉన్నతులో అనిపిస్తుంది. వాళ్ళ గురించి గర్వపడాల్సింది పోయి- వాళ్ళ మనసుల్ని నొప్పించావు. అది చాలా పాపం రా భరత్!" అంది సుప్రియ.

భరత్ మనసు పశ్చాత్తాపంతో నిండిపోయింది. 'అవును. తన తండ్రి తనంటే ఎంతో అభిమానం చూపించాడు. తన ప్రతి విషయంలో ఎంతో శ్రద్ధ తీసుకున్నాడు. తనకు తక్కువ మార్కులు వచ్చినప్పుడల్లా ఊరడించాడు. ధైర్యం చెప్పాడు. తనకు అనారోగ్యం కలిగితే ఎంతో ఆందోళన చెందేవాడు. అటువంటి తండ్రిని ఎన్నెన్ని మాటలన్నాడు తను? సుప్రియ అన్నట్లు ఆ పాపఫలితమే ఈరోజు ఎంసెట్ ఫలితాల్లో కనిపించింది...' అనుకున్నాడు.

ఆ సాయంత్రం సాయిరాం భార్యాపిల్లల్ని సినిమాకు తీసుకెళ్లాడు... భరత్ మనసు తేలికవుతుందని! సినిమా హాల్లో అతని సహోద్యోగులు ఇద్దరు కనిపించారు. వాళ్ళ పిల్లలకు ఎంసెట్‌లో మంచి ర్యాంకులు వచ్చాయని చెప్పారు వాళ్ళు. వాళ్ళ ఆనందం, గర్వం చూస్తుంటే భరత్‌కు ఎంతో సిగ్గనిపించింది. తన తండ్రి తమకోసం ఇంత చేస్తే- తను ఆయన స్నేహితుల ముందు తల దించుకొనేలా చేశాడు. తండ్రి వాళ్ళతో నవ్వుతూ మాట్లాడుతున్నా లోలోపల బాధపడుతూ ఉంటాడు. అతనికి తండ్రిని చూస్తుంటే ఎందుకో జాలి కలిగింది. 'తను తండ్రికి ఇవ్వాల్సిన కానుక ఇది కాదు...' అనుకున్నాడు.

ఇంటర్వెల్‌లో కాఫీ తాగుతూ కొడుకుతో చెప్పాడు సాయిరాం-

"ప్రపంచంలో అందరూ ఇంజనీర్లే బ్రతకటం లేదు. నువ్వు బి.ఎస్.సి. తర్వాత ఎం.ఎస్.సి. చేయవచ్చు. ఆపై పి.హెచ్.డి. చేసి లెక్చరరో, ప్రొఫెసరో కావొచ్చు. లేదా బి.ఎస్.సి. తర్వాత ఐ.ఎ.ఎస్.కు ప్రిపేర్ కావొచ్చు. లేదూ- నీవు ఇంజనీరింగే చదవాలనుకుంటే ఎంత డొనేషన్ అయినా కట్టి నిన్ను చదివిస్తాను. నువ్వు ఆనందంగా ఉండటమే మాకు కావలసింది!"

భరత్‌కు కళ్ళనీళ్లు తిరిగాయి తండ్రి మాటలకు.

"వద్దు నాన్నా! ముందు కౌన్సిలింగ్ కానీండి. ఏ సీటూ రాకపోతే లాంగ్‌టర్మ్ కోచింగ్ తీసుకుంటాను. ఈసారి మంచి ర్యాంకు తెచ్చుకుంటాను" అన్నాడు.

కౌన్సిలింగ్‌లో భరత్‌కు పేమెంట్ సీటు వచ్చింది.

అప్పుడే కొత్తగా ప్రవేశపెట్టిన గ్రూపులో కొన్ని సీట్లు మిగిలి ఉండటంతో తను అందులో చేరుతానని చెప్పాడు తండ్రితో.

అయితే తామున్న ఊరి కాలేజీలో ఆ గ్రూప్ లేకపోవడంతో వేరే ఊరిలో హాస్టల్‌లో ఉండి చదవాల్సివచ్చింది.

హాస్టల్‌లో చేరాక భరత్‌కి ప్రతిరోజూ తన కుటుంబసభ్యులే గుర్తుకురాసాగారు. తను వాళ్ళతో కలిసి ఉన్న సమయాన్ని అనవసరంగా గొడవలతో వృధా చేశానని అనిపించింది. అతనికి. అతనికి ఎక్కువగా అతని తండ్రి గుర్తుకురాసాగాడు. రాత్రిపూట తను ఎంతసేపు చదివినా తన తండ్రి కూడా తోడుగా కూర్చుని ఏదో ఒక పుస్తకం చదువుతూ ఉండేవాడు. "మీరెల్లి పడుకోండి నాన్నా... రేపు ఆఫీసులో పనిచెయ్యాలి కదా!" అని తనంటే, "రోజూ చేసే పనేగా, అందులో కష్టం ఏముంది..?" అనేవాడు.

అర్ధరాత్రి తమకు ఆకలవుతుందని ఆఫీసు నుంచి వచ్చేటప్పుడు ఏదో ఒక తినుబండారం తెచ్చి ఇంట్లో ఉంచేవాడు. తమకోసం ఏది చేయాలన్నా సిద్ధంగా ఉండేవాడు. 'అటువంటి తండ్రిని ఎన్నివిధాలుగా సతాయించానో..!" అని కుమిలి కుమిలి ఏడ్చేవాడు.

ఆ తర్వాత అతడు సెలవుల్లో ఎప్పుడు ఇంటికెళ్లినా తల్లిదండ్రులతో ఎంతో మర్యాదగా మాట్లాడేవాడు.

• • •

రెండవ సంవత్సరం పరీక్షలు రాసి ఇంటికొచ్చిన భరత్- తండ్రి స్కూటర్ గురించి తల్లిని అడిగాడు.

"సర్వీసింగ్‌కి ఇచ్చారు. నాలుగురోజుల్లో ఇస్తామన్నారట!"

"అమ్మా! నాతో అబద్ధం చెప్పకు. క్రిందటిసారి నేను వచ్చినప్పుడు నాన్న స్కూటరేదని అడిగితే- నాన్న స్నేహితుడు తీసుకెళ్లారని చెప్పావు. ఈసారి సర్వీసింగ్‌కు ఇచ్చారని అంటున్నావు. నిన్న మన స్కూటర్ వేరేవ్యక్తి వాడుతూండగా చూశాను."

"ఎక్కడ?"

"సినిమా హాల్లో. స్కూటర్ చూసి నాన్న సినిమాకొచ్చారేమోనని వెతికాను. తర్వాత నాకు తెలియనివ్యక్తి వచ్చి స్కూటర్ స్టార్ట్ చేయడం కనిపించింది. ముందు దొంగేమో అనుకున్నాను. కానీ- అతను పాస్ ఇవ్వడం చూసి, ఈమధ్య మీరు ఏదో ఒక కారణం చెబుతుండటం గుర్తొచ్చి నాన్న స్కూటర్ అమ్మేశారని నిర్ధారించుకున్నాను. చెప్పమ్మా... ఎందుకు అమ్మాల్సివచ్చింది?"

"నేను చెప్పింది విని నువ్వు బాధపడకూడదు."

"బాధపడనులే... చెప్పు!"

"నీ చదువు కోసం ఆయన స్నేహితుడి సహాయంతో బ్యాంకులో లోను తీసుకున్నారు కదా! ఆ లోనుకు వడ్డీ మాత్రం ఎప్పటికప్పుడు కడుతూ ఉండాలట. ఆ విషయం వాళ్ళు చెప్పలేదో, ఈయన వినలేదో తెలియదు కానీ, ఆ స్నేహితుడు వచ్చి వడ్డీ పాతిక వేలయిందని, కట్టకపోతే తనకు మాటొస్తుందని చెప్పాడు. అంత మొత్తం సర్దుబాటు చెయ్యలేక స్కూటర్ అమ్మి ఆ డబ్బు కట్టేశారు."

"మరి, నాన్న ఆఫీసుకు ఎలా వెళుతున్నారు?"

"బస్సులో!"

బాధగా కళ్ళు మూసుకున్నాడు భరత్.

• • •

భరత్ డిగ్రీ పూర్తయ్యేసరికి అతని సబ్జెక్టుకి డిమాండ్ పెరిగింది.

క్యాంపస్ ఇంటర్వ్యూలో సెలక్ట్ అయి మంచికంపెనీలో ఉద్యోగం తెచ్చుకున్నాడు. బెంగుళూరులోని ఆఫీసుకి పోస్టింగ్ ఇచ్చారు.

బెంగుళూరులో ఉన్న తన స్నేహితుని ఇంట్లో దిగమని, తర్వాత వేరే వసతి చూసుకోమని చెప్పాడు సాయిరాం. అలాగే మరికొందరి స్నేహితుల చిరునామాలు కూడా ఇచ్చి వాళ్ళందరిని కూడా ఒకసారి కలవమనీ, అవసరమయితే వాళ్ళ సహాయం పొందమనీ చెప్పాడు. బెంగుళూరులో

తనకు లభించిన గౌరవం, ఆదరణ చూసి ఆశ్చర్యపోయాడు భరత్. ఎవరింటికి వెళ్లినా 'సాయిరాం కొడుకు'గా అతన్ని ఎంతో బాగా చూసుకున్నారు. తన తండ్రి అంతమంది అభిమానం సంపాదించాడంటే అది ఒక్కరోజులో సాధ్యమయ్యే పనికాదు. ఎన్నో ఏళ్లుగా పరిచయాల్ని స్నేహంగా మార్చుకొంటూ, తన మంచితనంతో ఆ అనుబంధాన్ని కాపాడుకుంటూ ఉంటేనే అది సాధ్యం! తన తండ్రి నుంచి తాను నేర్చుకోవలసిన మొదటి పాఠం ఇది!' అనుకున్నాడు భరత్. సాయిరాం స్నేహితుడి సహాయంతో ఓ గది అద్దెకు తీసుకున్నాడు.

తన మొదటి జీతం తండ్రికి ఇవ్వబోయాడు భరత్.

"నీ దగ్గరే ఉంచుకో... నీ అవసరాలకు పోను మిగిలింది బ్యాంకులో దాచుకో!" అన్నాడు సాయిరాం.

"నా డబ్బులు తీసుకోకూడదా నాన్నా?"

"అలా అని కాదు. నా దగ్గరే ఉంటే ఖర్చయిపోతుంది. నువ్వు బ్యాంకులో దాచుకున్నావంటే భవిష్యత్తులో మనకు ఉపయోగపడుతుంది."

"మరి, నా చదువు కోసం బ్యాంకులో తీసుకున్న అప్పు?"

"నిన్ను చదివించడం నా బాధ్యత! అందువల్ల ఆ అప్పు నేనే తీరుస్తాను."

ఇంకేం మాట్లాడలేకపోయాడు భరత్.

మూడేళ్ల తర్వాత సుప్రియ పెళ్ళి నిశ్చయమైంది. పెళ్ళికి తన వంతుగా రెండు లక్షలు తండ్రికిచ్చాడు భరత్. ఆ డబ్బు తనకు ఎంతో ఉపయోగపడిందని భార్యాపిల్లలతో చెప్పాడు సాయిరాం.

పెళ్ళికి ముందురోజు రాత్రి పది గంటలకు భరత్ ఆధ్వర్యంలో జరిగిన వినోద కార్యక్రమంలో పిల్లలు, పెద్దలు పాల్గొన్నారు. పాటలు పాడారు, డ్యాన్సులు చేశారు. మిమిక్రీ చేశారు. పెళ్ళికొడుకు, అతని తరపు బంధువులు కూడా ఆ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

పన్నెండు గంటలకి చివరి ఐటమ్ చేయడానికి భరత్ స్టేజి మీదకు వచ్చాడు. 'అతనేం చేయబోతాడో...' అని అందరూ కుతూహలంగా చూడసాగారు.

"డియర్ ఫ్రెండ్స్! నేను ఓ కవిత రాశాను. ఆ కవితను మీకు చదివి వినిపిస్తాను. 'మాతృదేవోభవ, పితృదేవోభవ' అని మన పెద్దలు అన్నారు. అటువంటి దైవసమానులైన మా నాన్నకు అంకితమిస్తూ ఆయనకు నేను చేసుకుంటున్న విన్నపం ఇది-

*నాన్నా!*
*తెలిసీ తెలియని వయసులో చేశాను ఎన్నో పొరబాట్లు...*
*నీవూ, అమ్మా నా వల్ల పడ్డారు ఎన్నో అగచాట్లు!*
*ప్రతిరోజూ నీతో గొడవపడి నీ మనశ్శాంతి హరించేలా ప్రవర్తించాను...*
*నీవు మాత్రం నన్ను అన్ని సదుపాయాలూ వరించేలా చేశావు!*
*ఇంత చేసినా నీవు వేయలేదు నాకు ఏ శిక్షా...*
*ఆ సహనం, ఆ శాంతం నాకు పెద్ద బాలశిక్ష!*
*నిన్ను అవమానిస్తే నన్ను అభిమానించావు...*
*నేను అవమానం పొందితే నన్ను అనునయించావు!*

మంచితనాన్ని మాకు నూరిపోశావు...
ఎన్నో కష్టాలు పడి మాకో దారి చూపావు!
జీవితంలో మీరు సంపాదించిన ఆస్తి-
మంచి పేరు, మంచి మనుషులు, వారి మనసులు..!
నీ వారసుడిగా ఆ స్ఫూర్తితో
మీ ఆస్తిని రెండింతలు, మూడింతలు చేస్తాను!
ఆ దైవం కనిపించి నీకేం కావాలని అడిగితే
జన్మజన్మకూ నీ బిడ్డగానే పుట్టించమంటాను...
పశ్చాత్తాపం- చేసిన తప్పుల్ని కడిగెయ్యగలిగితే
చేతులెత్తి నీకు నమస్కరిస్తూ నా తప్పుల్ని క్షమించమంటాను."

- భరత్ చదవడం పూర్తిచేసి రెండుచేతులూ జోడించి తండ్రివైపు చూశాడు.

అందరూ చప్పట్లు కొడుతూంటే... సాయిరాం లేచి భరత్‌ని సమీపించి అతని భుజం తట్టి అందర్నీ ఉద్దేశించి-

"భరత్ చేసిన పొరపాట్లు చాలా చిన్నవి. దాదాపు ప్రతి కుటుంబంలో ఇలాంటి ఘర్షణలు తప్పనిసరి ఈరోజుల్లో! అయితే భరత్ త్వరగా తన తప్పుల్ని తెలుసుకొని సరిదిద్దుకొన్నాడు. వ్యక్తిగా ఎదిగి మాకెంతో సంతోషానిచ్చాడు. 'వీడు నా బిడ్డ' అని నేను గర్వంగా చెప్పుకొనే స్థాయికి ఎదిగాడు. అందుకు సాక్ష్యం అతని కంపెనీ ఇంత త్వరగా అతనికి పదోన్నతి కల్పించడం, బెంగుళూరు నుంచి వచ్చిన నా స్నేహితులు ఇతని గురించి మంచిగా నాకు చెప్పడం! తల్లిదండ్రులు బిడ్డల తప్పుల్ని కలకాలం మనసులో ఉంచుకోరు. ఎంత వేగంగా స్పందిస్తారో అంతే వేగంగా మరచిపోతారు" అన్నాడు.

తర్వాత భరత్ మాట్లాడుతూ... "నాలో మార్పుకు కారణం మా అక్క సుప్రియ! నా ఎంసెట్ ఫలితాలు నన్ను నిరుత్సాహానికి, తీవ్రమైన ఆవేదనకు గురిచేసినప్పుడు ఆమె బంగారంలాంటి మాట ఒకటి చెప్పింది... బిడ్డల తప్పులు తల్లిదండ్రులు క్షమించినా భగవంతుడు క్షమించడని! ఆ మాట నా మనసులో బలంగా నాటుకుంది. నేను నా ప్రవర్తన మార్చుకోగానే సుప్రియ అన్నట్లు నాకు అంతా మంచే జరిగింది. నేను ఇక్కడ ఉన్న నా వాళ్ళందరినీ కోరేదొకటే- మీ తల్లిదండ్రుల్ని గౌరవించండి, సమాజం మిమ్మల్ని గౌరవిస్తుంది. సమాజం గౌరవించే స్థాయికి మీరు చేరుకుంటారు" అన్నాడు.

ఆ తర్వాత అందరి హర్షధ్వానాల మధ్య తన తండ్రి కోసం కొన్న కొత్తస్కూటర్ తాళంచెవుల్ని తండ్రికి తన కానుకగా అందించాడు భరత్.